# రే రా ణి

కథలాగే ఉంది బతుకు—అని నవ్వి ఎడంచేతిని దిగలాగే హోల్డాలును కుడిచేతికి మార్చి ముందుకు నడిచాడు సుందర్రావు.

చిన్నప్పుడు ఘోర్తుఫారం నాడు చదివిన తెనుగు బంగాళీ నవలలోని "ఆ నిబిడాంధకార సమయంబున ... బాటసారి యొకడు....కలకత్తా పురవీధిలో...." జ్ఞాపకంవచ్చింది

ఉదయం పది గంటలకు రాజోలులో తిన్న మెతుకులు తోవలో జట్కా సైంధవులూ, బస్సుకౌరవులూ పన్నిన పద్మవ్యూహాలను ఛేదించుకొని ఇప్పటికి ఇక్కడికి తేలింది ప్రయాణం!

బాగా చీకటి పడుతోంది.

ప్రయాణం ఇకముందుకుసాగడానికి వీలులేదు. దరిద్రగొట్టు నాటుప్రయాణంలో ఒళ్ళంతా నలిగి నరంనరం సలుపుతోంది,

ముక్తీశ్వరపు కొత్త గోదావరిగాలి రివ్వున విసరి అలసిన సుందర్రావు శరీరాన్ని చల్లగా నిమిరింది.

బండి దిగగానే అక్కడ భోజనం హోటలు లేదనీ, బసకు, అక్కడికి రెండు వీధులవతల దక్షిణంగా ఒక పాత సత్తరవుందనీ తెలుసుకున్నాడు.

చచ్చేటంత ఆకలవుతోంది!

పెద్ద కాలవ వంతెనకింద శ్రీమత్కన్యకాపరమేశ్వరీ కాఫీ హోటేలులో తాగిన జిడ్డు టీ, తిన్న ఎండు బియ్యపు ఉప్మా, కడుపులో ప్రవేశించి యుద్ధం ప్రకటించగా రాజీకి తంటాలు పడుతూ కళ్ళుకూరుకు వస్తూండగా సత్రంవైపు నడిచాడు

రెండు వీధులుదాటి కుడివైపు కాదంటే ఎడంవైపుకు వెళ్ళి అటుకాదంటే తిన్నగా నడిచి ఒకవీధిచివరకు వెళ్ళి ఆగాడు. అక్కడ ఒక పాత పెంకుటిల్లు కనబడ్డది.

'అమ్మయ్యా' అని చరచర అరుగుమీదకువెళ్ళి ఒత్తుగా నివసిస్తున్న దుమ్మును అటూ ఇటూ దులిపి హోల్డాలుపరచి కూచుని చెమటతో తడిసిన చొక్కా తీసి పక్కనుంచి సిగరెట్ వెలిగించి దాని వెలుగులో చూచాడు. నాపరాయితాపిన పెద్ద అరుగులు.

మరామత్తులేక గోతులుపడి చెక్కాముక్కా ఊడి పోయాయి.

మహానుభావులు తినేసే ధర్మకర్తలేగాని సత్రవులూ. దేవాలయాలు, బాగుచేయించే అమాయకులెవరు?

లోపలనుంచి మాటలేమీ వినబడుతూన్నట్టు లేదు.

నౌకర్లూ, గుమస్తాలు, తినేసి నిద్రపోతున్నారు గాబోలు.

బాటసారులను ఆదరించడంకోసం ఏర్పడ్డ సత్రాలస్థితి ..........." అట్లా ఊహలమీద ఊహలుగా ఆలోచిస్తూనే సుందర్రావు ఎప్పుడో పక్కమీద ఒరిగాడు.

## ౨

హఠాత్తుగా సుందర్రావు కళ్లనులుముకుంటూ ఆ గదిలో ప్రవేశించాడు

నిద్ర మత్తులో దిగలాగే కళ్ళను బాగా విప్పినాలుగు పక్కలా స్పష్టంగా చూడడానికి ప్రయత్నించాడు

ఎక్కడనుంచో ఒక పరిమళపు తుఫాను బయలుదేరి తన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తూన్నది. ఆ సువాసన ఏ పూలదో— ఏ అత్తరవులదో, ఏ ప్రపంచానిదో జ్ఞాపకం రావడంలేదు

ఏవేవో స్మృతులువచ్చి మసకమసకగా మాయమై పోతున్నవి.

తాను వేమూరి సుందర్రావుననీ, కాకినాడ ఆఫీసులో ఉద్యోగమనీమాత్రం జ్ఞాపకం ఉంది.

నిద్రకళ్ళను బాగా ఎత్తి గది అంతా చూచాడు.

ఎడంవైపున పెద్దపందిరి పట్టెమంచం. దానిమీద రెండు దిండ్లూ, పాలమీగడవంటి పరుపు, దుప్పటీ, చక్కగా పరచి ఉన్నాయి.

కుడివైపున ఎత్తయిన ఇత్తడి సెమ్మాలో స్వచ్ఛంగా దీపం వెలుగుతోంది.

తెల్లని గోడలమీద పడుచువారిని హుషార్ చేసే రకరకాల పటాలు.

ఇంద్రుడు—అహల్య, మేనక—విశ్వామిత్రుడు, పరాశరుడు—సత్యవతి, తార—చంద్రుడు, మనస్సును వెచ్చగా కదిపి కితకితలుపెట్టారు.

అక్కడ ఎవ్వరూలేరు.

ఎంత సేపు తానక్కడుండాలో, ఎందుకుండాలో సుందర్రావుకు తెలియదు

రెండు నిమిషాలు.

మళ్ళా పరిమళ ప్రవాహం ముంచెత్తింది. ఆ విచిత్రానుభవంలో అతని ప్రాణం దూదిపింజలా ఎటో తేలిపోతున్నది.

ఆలోచించేశక్తి హరించిందా?

చటుక్కున స్ఫురించింది.

నైట్ క్వీన్!!

అబ్బ! అనుకున్నాడు.

రవివర్మ దమయంతిలా ఉంది!

ఇరవై ఏళ్ళ వయస్సు,

బంగారపురంగుగల పచ్చనిపొడుగైన శరీరం. మాంసలంగా నున్నగా వేలాడే బుజాలు. స్వచ్ఛమైన చీర, రవిక, లోంచి ఆమె బిగువైన యౌవనంపొంగి కనబడుతోంది. తల పొడిపొడిగా వుంచి.

పిరుదలకంటా వేలాడే వాలుజడలో ఘుమఘుమ లాడే పెద్దపెద్ద పూలగుత్తులు.

సుందర్రావు నిర్ఘాంతపడి చూచాడు.

ఎవరీమె ?

? ? ?

నైట్క్వీనా?

నవ్వొచ్చింది.

ఆమెతో వచ్చిన సువాసన ఆగది అంతా నిండింది.

వచ్చి పందిరిమంచపు స్తంభానికి ఒకచేయి ఆనించి ఒయ్యారంగా త్రిభంగిగానించుని అతన్ని దగ్గరగా రమ్మని సంజ్ఞ చేసింది.

అతడు ఊపిరి విడవడంకూడా మరచి ఆమెను చూస్తూ నించున్నాడు.

కాళ్లు కదలలేదు.

మధ్య ఒక్క నిమిషం.

పగబట్టిన త్రాచులా ఆమె చప్పునవచ్చి సుందరాన్ని ఊపిరాడకుండా కౌగలించుకొని మాటలాడకుండా బిగువైన నున్నని బుజాలతో బలంగా ముందుకు నెట్టింది.

ఎరగనివాడు విస్కీతాగినట్టు ఆ కౌగిలిలో అతని ఆపాద మస్తకం వేడెక్కి నరాలు ఝల్లుమన్నాయి. శరీరంలోని ప్రతి అణువూ ఒక వింతనిషాలో వివశంగా తూలి అతడు ఆమెచేతిలో కీలుబొమ్మ అయిపోయాడు.

5 నిమిషాలకు సుందరం పందిరిమంచపు మెత్తని దిండ్ల పరుపుమీద కళ్లు తెరిచాడు.

పన్నీటి వాసనతో పరిమళించే పొడుగైన నల్లనిజుట్టు చెదరి అతని ముఖాన్ని కప్పింది మెత్తని బరువులక్రింద బలంగా నలిగి నలిగి అతడొక్కసారి గట్టిగా మూలిగి కదిలాడు.

ఆమెలేచి తలసర్దుకుని దూరంగా నించుని నవ్వింది.

అతడు బద్ధకంగా కదిలి అట్లాగే కళ్ళు మూసుకున్నాడు.

మళ్ళా నాలుగు నిమిషాలు—

ఆమె సుందరం చెయ్యిపట్టుకుని కిందకు లాగింది. అతడు

మత్తుగా కిందకు తూలి ఆమెదగ్గర బడిపంతులు దగ్గర కుర్రాడులా ఏంచున్నాడు.

వారి శరీరాలను సన్నని మేఘపు పొరలో నున్నని వెన్నెల తెరలో కప్పుతూన్నట్టుంది.

పెరటివైపు తెరచిఉన్న ద్వారంలోనుంచి వెన్నెల పాలవెల్లి తెగించి భూమిమీదకు కురుస్తూ కనబడుతోంది

అతని నడుంచుట్టూ చెయిచుట్టి ఆమె పెరటిలోని పూల మొక్కల దగ్గరకు నడిపించింది.

చక్కగా గచ్చుచేసిన గిలకనుయ్యి. దానిచుట్టూ బాగా పూచి పరిమళించే మాలతి, జాజి గులాబి పూలపొదలు.

యిద్దరూ నూతికెదురుగా నడిచి ఒక పొద దగ్గరకువెళ్లారు.

అక్కడ సిమెంటుతో కట్టిన నున్నని అరుగు ఒకటి, రెండువైపులా చేరబడడానికి వీలుగా— విశాలంగా వుంది.

సుందర్రావు అరుగుమీద నెమ్మదిగా చదికిలబడి ఒక పక్కకు బద్ధకంగా చేరబడ్డాడు. చుట్టూ ఉజ్జ్వలమైన వెన్నెల వెలుగుతోంది.

నిద్రలేక మండే వెచ్చని కళ్ళతో చల్లగా వెలిగే చంద్రుణ్ణి అతడుమాత్రం పరధ్యానంగా చూస్తున్నాడు.

దోసెడు జాజిపూల గుత్తులతో ఆమె చట్లునవచ్చి పక్కను కూచుంది.

ఉలికిపడి చూచాడు—

ఆమె—

తలనిండా—ఘుంగురులలో—మెడచుట్టూ పూలగుత్తులు జారుతున్నాయి.

ఆ వెన్నెలలో—ఏ కర్పూర ద్వీపంనుంచో ఎగిరివచ్చిన పూలరాణిలా ధగధగ వెలుగుతూ— తనభయంకర సౌందర్యంతో అతని కన్నులు పొడిచింది.

అతడు వణకే చేతులతో తనకళ్ళను మూసుకున్నాడు.

ఆమె పకపక నవ్వి అతనిదగ్గరగా జరిగి అతనితల తన ఒడిలోకి తీసుకొని చేతుల్లోని పూలగుత్తులు — అతని తల నిండా— వక్షఃస్థలంమీదా— కప్పి నెమ్మదిగా అతనితల నిమి రింది. అతని కళ్లు తెరచాడు, ఆమె తెల్లని చెక్కిళ్ళమీద చారికలుగా జారే కన్నీరుజాడలు అతనికి కనబడ్డాయి.

అంతవరకూ కలకల నవ్వులతో వెలిగే ఈమె ముఖంలో హఠాత్తుగా ఈ మలిన దుఃఖాశ్రువులేమిటి?

ఆమెవైపు జాలిగా అర్థంకాని చూపుచూశాడు.

ఉత్తరక్షణంలో ఆమె చుట్టూవున్న తెల్లపువ్వులు సిగ్గు పడేలా కహాకహా నవ్వింది.

కందగడ్డలా ముఖం ఎఱ్ఱబడి తలదగ్గర నరాలు వెచ్చగా కొట్టుకున్నాయి.

ఆమె చటుక్కున అతని మీదకు వంగి ఎఱ్ఱని పెదవుల్ని రక్తపిపాస వున్న కామినిలా గట్టిగా నొక్కింది.

నెత్తురు చిమ్మింది—

అతడు కెవ్వున కేకవేసి వెనక్కి ఒరిగాడు.

## 3

తెల్లవారుతోంది

మునలివేపచెట్టుమీద కాకులు మేలుకొని అరుస్తున్నాయి.

సుందర్రావు హడిలిపడి పక్కమీదనుంచి లేచి కూచుని నాల్గువైపులా చూచాడు.

చుట్టుపక్కల మనుష్యు లెవరూ కనపడలేదు.

అరుగుమీద దుమ్ములో మునిగి తేలుతున్న హోల్డాలును చుట్టి చంకనుపెట్టుకొని గబగబ ఇంటిమెట్లు దిగి బళ్ళస్టాండు వైపు నడిచాడు.

ఆ వీధిమలుపు దాటలేదు.

"సుందరం, సుందరం !"

వెనక్కి తిరిగి చూచాడు.

"డా॥ శివరావు !"

"హల్లో! ఇక్కడుంటున్నావా? నాకు తెలియదుసుమా— రాత్రి ఎంత హాయిగా గడిపివుండేవాళ్ళం?

చూడు ఆ పాత సత్త్రవు అరుగుమీద రాత్రి తెల్లవార్లూ నిద్రలేక చచ్చాననుకో నమ్ము"

సుందర్రావు గుక్కతిప్పకుండా అన్నాడు. శివరావు ఆశ్చర్యపడి "రెండు వీధులవతలగాని ఇక్కడెక్కడా సత్రం లేదోయ్—కొంపతీసి ఆ యెత్తరుగుల పెంకుటింటికిగాని వెళ్ళ లేదుగదా!" అన్నాడు. ముఖంలో ఎట్టి విశేషం కనపడకపోవ డానికి ప్రయత్నిస్తూ—

సుందర్రావు తెల్లబోయాడు—

"ఔను....ఏం?" ముఖం అంతా ప్రశ్నగాచేసి అన్నాడు.

శివరావు మెల్లగానవ్వి 'మరేంలేదులే— అదంతా ఒక చిత్రకథ—నడు చెబుతాను" అని కాఫీ హొటలువైపు తోవతీసి ప్రారంభించాడు.

పాపం! ఆ అమ్మాయికి జీవితంలో దాహం తీరలేదు. ఈ లోకంలో తాను చవిచూచితీరాలని గాఢంగా ఆశించిన అనుభవాలు పెదవినుంచి జారిపోయాయి.

విండి తొణికిసలాడే ఆమె యౌవన మధువు ఏ ప్రియుణ్ణీ ఇంక పారవశ్యంలో ఊగించకుండా ఒకనాడు హఠాత్తుగా నేలకు ఒలికిపోయింది.

చీకటిపడితే ఆరోడ్డున ఇప్పుడు ఎవ్వరూ నడవరు. ఆరు నెల్లకిందట పెదవులు చప్పరించుకుంటూ ఆరోడ్డున ఆమె దర్శనం కోసం నిద్రాహారాలు మరచి ఎన్ని పడుచుప్రాణాలుగస్తీ తిరిగేవి!!

ఈనాడు హడల్—

పిరికి వెధవలు—

పాపం—తలచుకొన్నప్పుడల్లా నాకు మనశ్శాంతిచెడుతుంది

ఈ పతివ్రతల లోకంలో ఆమెచరిత్రహీన. ఆమె మనిషే కాదని నా అనుమానం.

విను—

సుమారు సంవత్సరం అవుతుంది.

నే నీ వూరు రూరల్ డిస్పెన్సరీకి వచ్చిన కొత్త రోజులు.

ఒక పాతికేండ్ల యువకుడు ఇరవై యేళ్ళఅమ్మాయీ, ఆకస్మికంగా ఒకనాడువచ్చి ఆ యింట్లో కాపురం పెట్టారు. రోజూ నేను ఆయింటిమీదుగానే డిస్పెన్సరీకి వెళ్తూండేవాణ్ణి.

ఆ అమ్మాయి వడపోసిన బంగారపు బొమ్మ—ఆవిణ్ణి పరాకుగా చూచినవాళ్లు ఈవిడ మనుష్యుల కడుపున పుట్టినదేనా అనుకునేవారు.

గంటకో చీర కట్టుకునేది, చీరకొక రవిక. ఆ రెండింటికి ఒక్కొక్క జడ మార్చివేసుకునేది. జడకు ఒక్కొక్క రీతిగా పూలు చుట్టుకునేది. ఆమె ఆ శరీరంతో—బట్టలతో—పూలతో—నడిస్తే, చక్కని శ్రుతిలో తీర్చి దిద్దిన గీతం వీణమీద తియ్యగా కదలి నట్టుండేది.

ఆమెకు ఎదురుగా—బలమైన కండలుతిరిగిన శరీరంతో—ఏ రసికతా—చమత్కారమూ లేక ఎనిమిదంకెలా—కాంతి లేని చూపుతో అతను కనబడేవాడు.

ఏమిటీదాంపత్యం?

తర్వాత తెలిసింది....

వారిది కోనసీమలో ఏదో పల్లెటూరు. అతడు స్కూల్ ఫైనల్ మూడేళ్లూ తప్పి హోమియోపతీ వైద్యం ప్రారంభించాడు. సామాన్య సంసారి, కులానికి కాపు.

ఆ అమ్మాయి బ్రాహ్మణ బాల వితంతువు. చాలాఆస్తి వుంది. తల్లీ చిన్నతమ్ముడూ వున్నారు. తల్లికి ఒక్కతే కూతురు. పాపం.... ఆమెకూతురు వినోదాలకేమీ అడ్డు రాలేకపోయింది. సిల్కుచీరలు కట్టుకోవచ్చు. మల్లెపూలు. పెట్టుకోవచ్చు.

కాని....

బ్రాహ్మణ ధర్మాన్నిబట్టి ఆమెశరీరానికి మాత్రంవైధవ్యం.

ఈ అపశ్రుతి క్రమంగా.... నిరాశగా — నిస్పృహగా మారి, హిస్టీరియాను పందించింది.

దాన్ని కదలించడానికి అనేక సూట్లూ .. స్టెతస్కోపులూ, ఖల్వపుపాత్రాలు ప్రయత్నించి విఫలమయ్యాయి.

"స్వామి" చాలా సాధకుడనీ హోమియోపతీలో మంచి ప్రజ్ఞ అనీ తెలిసింది.

చిన్నప్పటినుంచీ యెరిగున్నవాడు. యోగ్యుడు

వరలక్ష్మి హిస్టీరియాకు 'స్వామి' చేత మందు వేయించారు. గుణం కనపడింది

దాని సంపూర్ణ ఫలితంగా వారిద్దరూవచ్చి ఈ ఊళ్ళో నివాసం ఏర్పరచారు. పాపం....సరిగా నెల్లాళ్ళు అవుతుంది. మధ్యాహ్నం మూడు గంటలకు ఒకనాడు అతడు కళ్ళ నీళ్ళు కుక్కుకుంటూ నాదగ్గరకువచ్చి ఆమె చాలా ప్రమాదస్థితిలో ఉందనిచెప్పి నా సహాయంకోరాడు ఆమెను ఈ భూలోకంలో నిలుపుదామని ఎంతైనా ప్రయత్నించాను. కాని శక్యంకాలేదు. ప్రసవించి హఠాత్తుగా ఆనాటి సాయంత్రం ఆ లావణ్యదీపం ఆరిపోయింది.

ఏమో....నాకు నమ్మకం లేదు.

అప్సరసలకు చావుండదుగదూ!

ఆమె ఆ సౌందర్యంతో....అలంకరణంతో పరిమళాలతో ...ఒక్కసారి రాత్రి ఈ భూమికిదిగి ...ఇంకా నిద్దరపోని తన రసికత్వంఫలిస్తుందేమోఅని చూచిచూచి వెళ్ళిపోతూంటుందిగాబోలు

అని శివరావు నిట్టూర్చి సుందరం ముఖంవైపు చూశాడు.

అతడు చెమటతో కాలువలుకట్టే తన ముఖాన్ని జేబురుమాలుతో నొక్కి తుడుచుకుంటున్నాడు.

---